## ఆకట్టుకుంటున్న బొమ్మలకొలువు

ప్రొద్దుటూరు కల్చరల్: దసరా అంటేనే ప్రత్యేకంగా గుర్తుకు వచ్చేది బొమ్మలకొలువు. స్థానిక కోటవీధిలో మైదుకూరు శ్రీధర్ ఇంటిలో దసరా సందర్భంగా ఏటా బొమ్మల కొలువు ఏర్పాటు చేస్తున్నారు. చార్‌ధామ్, అమర్‌నాథ్, గోకులం, అమ్మవారి స్వరూపాలు, దశావతారాలు, తదితర వేయి బొమ్మలతో ఏర్పాటుచేసిన ఈ కొలువును పలువురు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

## ఎల్ఎస్‌పీ నుంచి నీటి విడుదల



లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా ముస్నెళ్లి చెరువుకు నీటిని విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ

బి.కోడూరు: మండలంలోని లోయర్ సగిలేరు ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా మండలంలోని ఆయకట్టు చెరువులకు శుక్రవారం సాయంత్రం ఇరిగేషన్ ఈఈ వెంకటరామయ్య, డీఈ వేణుగోపాల్‌రెడ్డిల ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే కె.విజయమ్మ నీటిని విడుదల చేశారు. అలాగే ముస్నెళ్లి ఆయకట్టు చెరువుకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీటిని విడుదల చేశారు. ఎల్ఎస్‌పీ ఎడమ కాలువ పరిధిలో సుమారు 32 ఆయకట్టు చెరువులు 5 వేల ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. ఇంత వరకు వర్షం పడకపోవడంతో ఆయకట్టు చెరువులన్నీ ఎడారిని తలపిస్తున్నాయి. మండలంలోని చెరువులకు నీరందించాలని రైతులు కోరుతున్నారు. కార్యక్రమంలో రామచంద్రారెడ్డి, ఓ.రమణారెడ్డి, జి.రమణారెడ్డి, టి.రామ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వేద విద్యా ప్రదాయిని.. గాయత్రి



రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో కైలాసంలో పార్వతీ పరమేశ్వరులు



ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో గాయత్రీదేవి



పోరుమామిళ్ల అమ్మవారిశాలలో ఎమ్మెల్సీ దంపతులు, కుమారుడు, నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్: సకల వేద విద్య ప్రదాయిని.. గాయత్రీ నమోస్తుతే అంటూ అమ్మవారిని భక్తులు శరణువేడారు. దసరా ఉత్సవాల్లో 9వ రోజున శుక్రవారం రాత్రి వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారు తామర పుష్పంపై గాయత్రీదేవిగా కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. హంసలు, పలు దేవతా మూర్తుల సెట్టింగ్ అందరినీ ఆకట్టుకుంది. రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష్మీవెంకటేశ్వర స్వామిగా, చెన్నకేశవ స్వామి ఆలయంలో ధనలక్ష్మీదేవిగా, వినాయకనగర్ చౌడేశ్వరీదేవి, ముక్తిరామలింగేశ్వర స్వామి, శివాలయాల్లో గాయత్రీదేవిగా, సాయిబాబా ఆలయంలో కంచికామాక్షిదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు.

**బొమ్మల సెట్టింగ్ అదుర్స్**

భక్తులను ఆకర్షించేలా ఆలయాల నిర్వాహకులు బొమ్మల సెట్టింగ్ ఏర్పాటుచేస్తారు. ఈ ఏడాది ప్రొద్దుటూరులో వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి, రతనాల వెంకటేశ్వరస్వామి, శివాలయం, చెన్నకేశవ స్వామి ఆలయాల్లో వివిధ రకాల బొమ్మలు విశేషంగా ఆకర్షిస్తున్నాయి.మహావిష్ణువు దశావతరాలు, శ్రీకృష్ణుని రూపాలు, కామధేనువు సెట్టింగ్, అష్టలక్ష్మీ దేవతల సెట్టింగ్, కాళింగమర్దిని, గోపికా వల్లభుడు, ఆదిశేషుడిపై మహావిష్ణువు, గణపతి వాటర్ పాల్, ఫౌంటెయిన్ సెట్టింగ్, జలపాతం మధ్య పరమశివుని సెట్టింగ్‌తో బొమ్మల కొలువు ఏర్పాటుచేస్తున్నారు.



బద్వేలు అర్బన్ : ఎమ్మెల్యే డాక్టర్ సుధను సన్మానిస్తున్న ఆర్యవైశ్యులు

- స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారిని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్‌నాయుడు, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, టీడీపీ నేత సీఎం సురేష్ నాయుడు శుక్రవారం దర్శించుకున్నారు. వారికి అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రాంమోహన్‌రావు అందించారు. జొన్నలగడ్డ రవీంద్రబాబు, నాగేశ్వరరావు, సీవీ సురేష్ పాల్గొన్నారు.

దువ్వూరు: దువ్వూరులోని శ్రీమరకత వాసవి కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో గజలక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు.



ప్రొద్దుటూరు కల్చరల్ : చెన్నకేశవస్వామి ఆలయంలో..



ప్రొద్దుటూరు కల్చరల్ : చౌడేశ్వరిదేవి ఆలయంలో...



బ్రహ్మంగారిమఠం : శ్రీ ఈశ్వరీదేవిమఠంలో...



బద్వేలు అర్బన్: వీరభద్రస్వామి ఆలయంలో లక్ష్మీదేవి



బి.మఠం: అమ్మవారిశాలలో గాయత్రీదేవి అలంకరణ



మైదుకూరు: అమ్మవారిశాలలో గజలక్ష్మీదేవి

## నిత్యావసర ధరల పెరుగుదలపై వినూత్న నిరసన

- టమోటా రూ.100.. క్వార్టర్ రూ.99
- సంక్షేమాన్ని గాలికి వదిలిన చంద్రబాబు ప్రభుత్వం
- మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



పెరిగిన నిత్యావసర వస్తువులను చూపుతున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలపై మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఆయన శుక్రవారం తోపుడు బండిపై కూరగాయలు, నిత్యావసర వస్తువులు పెట్టుకుని వీధి వెంబడి వెళ్లారు. జగనన్న ప్రభుత్వంలో ధరలు, చంద్రబాబు ప్రభుత్వంలో ధరలకు వ్యత్యాసం చూడాలని ప్రజలను కోరారు. చంద్రబాబు ప్రభుత్వం ప్రజలపై బాదుడే బదుడు మోత మోగిస్తోందని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాచమల్లు శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైందని తెలిపారు. అనేక రకాల అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఇప్పుడు ప్రజా సమస్యలను పట్టించుకోకుండా వదిలేశారన్నారు.

**టమోటాలు కిలో రూ.100.. క్వార్టర్ రూ.99:** నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించలేని చంద్రబాబు ప్రభుత్వం మద్యాన్ని అందుబాటులోకి తెచ్చిందని రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. కిలో టమోటా మార్కెట్‌లో రూ.100 పలుకుతుండగా చంద్రబాబు క్వార్టర్ బాటిల్ మద్యం రూ.99కే ఇచ్చేలా ఏర్పాట్లు చేశారన్నారు.

**కిలో తెల్లగడ్డలు రూ.440:** కిలో రూ.440 ప్రకారం రూ.220 పెట్టి అర కిలో తెల్లగడ్డలు కొనుగోలు చేశామని సుబ్బమ్మ అనే మహిళ మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డికి తెలిపింది. ధరల పెరుగుదల వలన తమకు ఉపాధి లేకుండా పోయిందని తోపుడు బండిపై కూరగాయల వ్యాపారం చేస్తున్న మహిళ చెప్పారు. రాచమల్లు వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, ఎంపీపీ శేఖర్ యాదవ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, ఆప్కాబ్ మాజీ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాజారాం రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరు నాగేంద్రారెడ్డి, ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాల కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

## సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య



మృతుడు రమేష్

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల టౌన్ బద్వేలు రోడ్డులోని రామ్‌నగర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి శంకవరం రమేష్ (30) గురువారం రాత్రి పొద్దుపోయాక పురుగు మందు తాగి ఇంటి ముందు చనిపోయాడు. అతనికి రెండు సంవత్సరాల క్రితం వివాహం కాగా కొద్ది రోజులకే భార్య అతనికి దూరమయినట్లు తెలిసింది. ఆత్మహత్య సమాచారం తెలిసి శుక్రవారం ఎస్ ఐ కొండారెడ్డి సంఘటన స్థలానికి వెళ్లి శవాన్ని పోస్టుమార్టంకు పంపించారు. వ్యక్తిగత కారణాలతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుని తండ్రి శ్రీరాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## ఇసుకను తరలిస్తున్న 12 ఎడ్ల బండ్లు స్వాధీనం

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక ఎర్రగుంట్ల రోడ్డులోని ఏకోపార్కు ఎదురుగా ఉన్న సోములవారిపల్లె పంచాయతీ పరిధిలోని రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 12 ఎడ్ల బండ్లను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎఫ్ఆర్‌ఓ హేమాంజలి శుక్రవారం ఉదయం సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఇసుకను తరలిస్తున్న 12 ఎడ్ల బండ్లను స్వాధీనం చేసుకున్నారు.

## అన్ని రంగాల్లో మహిళల ప్రతిభ



మాట్లాడుతున్న డాక్టర్ శివప్రసాద్ రెడ్డి

ప్రొద్దుటూరు క్రైం: స్త్రీలు నేడు పురుషులకంటే అన్ని రంగాల్లో ప్రతిభ చూపిస్తున్నారని డాక్టర్ బద్వేలి శివప్రసాద్ రెడ్డి తెలిపారు. సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో శుక్రవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ బాలికల అభివృద్ధి సాధించడానికి ప్రతి ఒక్కరూ ప్రోత్సాహం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిర్డ్ సొసైటీ ప్రెసిడెంట్ ఎంపీ సుబ్బారెడ్డి, కార్యదర్శి చెన్నమ్మ, సభ్యులు రమణమ్మ, గంగాభవాని పాల్గొన్నారు.



































## కూటమి ప్రభుత్వం హామీలు నెరవేర్చాలి

బ్రహ్మంగారిమఠం: కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు నెరవే ర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర డిమాండ్ చేశారు. శుక్రవారం బి.మఠంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం 100రోజుల పరిపాలన పూర్తి అయినా.. ఇప్పటివరకు ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని విమర్శించారు. కార్మికులకు కనీస వేతనాలు పెంచుతామని, మహిళకు నెలకు రూ.1,500 ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. తల్లికి వందనం, రైతులకు సాయం గురించి మరిచిపోయారని విమర్శించారు.

**సీపీఐలో చేరిక:** మండలంలో పలు గ్రామాల నుంచి వివిధ పార్టీలకు చెందిన 20 కుటుంబాలు సీపీఐలో చేరాయి. వారికి కడువాలు కప్పి పార్టీలోని గాలి చంద్ర ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వీరశేఖర్, బాదుల్లా, శివరాం, భాస్కర్, బాలు, నాయకులు సోమిరెడ్డిపల్లె నారాయణ, ప్రభాకర్ పాల్గొన్నారు.

## ప్రైవేట్ బస్సుల దోపిడీ అరికట్టాలి


మాట్లాడుతున్న సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ

ప్రొద్దుటూరు: దసరా సందర్భంగా ప్రైవేట్ బస్సుల దోపిడీని ఆర్టీఏ అధికారులు అరికట్టాలని సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ విమర్శించారు. సీపీఎం కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ నుంచి ప్రొద్దుటూరుకు ఒక్కొక్క వ్యక్తి వద్ద రూ.1500 నుంచి రూ.3 వేల వరకు వసూలు చేస్తున్నారన్నారు. దసరా పండగ సందర్భంగా పెద్ద మొత్తంలో ప్రైవేటు ట్రావెల్స్ వారు దోపిడీ చేస్తున్నా ఆర్టీఏ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. చార్జీలు చాలవు అన్నట్లుగా లగేజీలు నింపి గూడ్స్ వెహికల్ మాదిరిగా నడుపుతున్నా వారు మౌనం వహించడం ఏమిటని ప్రశ్నించారు. ఈ సమావేశంలో సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మయ్య, శివ పాల్గొన్నారు.

## ముగిసిన ధార్మిక కార్యక్రమాలు

బ్రహ్మంగారిమఠం : మండలంలోని మద్దిరెడ్డిపల్లె గ్రామంలోని రామాలయంలో ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు టీటీడీ ధార్మిక ఉపన్యాసాలు, భజనలు, కుంకుమ పూజ, హరికథ కార్యక్రమాలు నిర్వహించారు. ధర్మ ప్రచార పరిషత్ కడప ప్రోగ్రాం అసిస్టెంట్ టి.గోపిబాబు, సూపరింటెండెంట్ ఢిల్లీ రెడ్డి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మద్దిరెడ్డి, రామచంద్రారెడ్డి, లక్ష్మీదేవి, అచ్చమ్మ, నారాయణమ్మ, ఆదిలక్షుమయ్య పాల్గొన్నారు.

## అగ్రిసెట్ ఫలితాల్లో విద్యార్థి ప్రతిభ


రామవెంకట సుభాష్

దువ్వూరు: అగ్రిసెట్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో దువ్వూరు మండలం ఏకోపల్లె గ్రామానికి చెందిన పంగా సుబ్బరాయుడు కుమారుడు పంగా రామ వెంకట సుభాష్ రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంక్ సాధించాడు. గుంటూరులోని ఆచార్య ఎన్జీ రంగ విశ్వవిద్యాలయం 2024–25 ఏడాదికి గాను అగ్రికల్చర్ బీఎస్సీ ప్రవేశాల కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్షలో రామ వెంకట సుభాష్ 120 మార్కులకు 115 మార్కులతో ప్రథమ ర్యాంక్ సాధించాడు. ర్యాంకు రావడం పట్ల తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్తులు రామ వెంకట సుభాష్ అభినందించారు.